# ఓం నమః శివాయ

# 1. సుందర మూర్తి నాయనారు

సుందరమూర్తి నాయనారు 8వ శతాబ్దములో వినుతికెక్కిన మహా శివభక్తుడు. తమిళనాడులో నలుగురు మతగురువులలో ఈయన ఒకరు. వీరిని సమయాచారులని పిలిచేవారు. అడుగుపెట్టిన ప్రతి దివ్యప్రదేశములో శివుని గూర్చి పాడేవాడు, నుతించేవాడు. ఈ పాటలను తేవారం అంటారు. ఇవన్నీ ఒక గ్రంథంగా రూపొందించబడ్డాయి. అందరు భక్తులు ఈ రోజుకి గూడ తేవారం పాటలు ముగ్ధ మనోహరంగా పాడతారు. సుందరారు పాడిన పాటలు, అప్పారు (లేక) తిరునవక్కరసు పాడిన పాటలు, తిరుజ్ఞాన సంబంధార్ పాడిన పాటలు - వీనినన్నింటిని తేవారమంటారు. మాణిక్యవాచకరు పాడిన పాటలకు తిరువాచగమ్ అని పేరు వచ్చింది.

సుందరారు శివుని కొలిచిన తీరు సఖ్య భావంతో. శివుడు తన నెచ్చెలుడు, మిత్రుడు, సఖుడు. అందుకని ఈశ్వరుని - తనకు కావలసిన వన్నింటిని స్నేహభావంతో చొరవగా అడిగేవాడు. ఎంత సఖ్య భావం వున్నా తనకై దేవుని ఏమీ స్వార్ధంతో కోరలేదు. తన మీద ఆధారపడి యున్నవారి హితవు కోసం దేవుని తన హక్కుగా అడిగేవాడు. ఈయన జీవించింది 18 సంవత్సరములు మాత్రమే.

సుందరారు అంతా శివమయమైన తిరునావలూరులో జన్మించాడు. శైవమతమిచ్చట స్థిరముగా యుంది. ఎచ్చోట చూచినా శివుడే కన్పించేవాడు. ఈవూళ్లో చాలా పవిత్రంగా భక్తియుతుడుగా మంచిపేరు తెచ్చుకున్న శడయనాయనారు నివసించేవాడు. ఆయన పూర్వీకులందరూ శివభక్తులే. ఇసై జ్ఞానమ్మ ఆయన ధర్మపత్ని. ఈ పుణ్యదంపతులకు దైవదత్తంగా ఒక పుత్రుడు కలిగాడు. అతనికి తాతగారిపేరు నంబి అరూరారు అని నామకరణం చేశారు.

నంబిఅరూరారు తన పూర్వజన్మలో అలలసుందరారు నామధేయుడు. పరమ శివభక్తుడు, కైలాసంలో శివుని సామీప్యంలో వుండేవాడు. దేవతలు, అసురులు క్షీరసాగర మధనం జరిపే సమయంలో - సాగరం నుండి భయంకరమైన హాలాహలం ఉద్భవించింది. అది అంతటా వ్యాపించి అన్ని జీవులను కబళించేటట్లు రూపొందింది. అప్పడు సుందరారు ఆ గరళమును తన చేతులతో ప్రోవుచేసి శివుని కందించాడు. ప్రపంచాన్ని రక్షించటానికి శివుడు దానిని తాగాడు. శివునికి అందించటంచేత - హాలాహలంకు చిన్ని పదంగా ఆలల అనేమాట సుందరారు పేరుకు ముందు చేర్చబడింది. అప్పటినుంచి ఆలల సుందారారుగా గణుతికెక్కాడు.

ఆలల సుందారారు ఒక రోజున కైలాసంలో శివుని ప్రక్కన ఉన్నాడు. దేవదేవుని కొలుచుటకు పూవులను సేకరించుట పనిగా పెట్టుకున్నాడు. తోటలో నుంచి పువ్వులను తెస్తూ - పార్వతీదేవికి సహాయకారులుగానున్న అనిందితిని కమలినిని చూచాడు. వాళ్లిద్దరూ పార్వతీదేవి అర్చనకు పూలను తెస్తున్నారు. వాళ్లని సుందరారు మోహ దృష్టితో చూ

డటం సంభవించింది. పరమశివుడు ఇది గ్రహించాడు. ఆలల సుందరారుని పిలిచి - 'వీళ్లిద్దరి ప్రేమలో పడ్డావు కాన - వాళ్లు - నీవు భూమిమీద పుట్టండి. అక్కడ వాళ్లిద్దరిని వివాహమాడు. భూలోకంలో సుఖాలను అనుభవించు' అని ఆజ్ఞాపించాడు. సుందరారుకు మిక్కిలి దుఃఖము కలిగింది. తన తప్పను గుర్తెరిగాడు. పరమశివుని వీడి ఉండగలనా అని వాపోయాడు. పరమశివుని ప్రార్థించాడు. 'స్వామీ! నా దుష్టతలపు ఈ పరిస్థితి తెచ్చింది. మిమ్ములను వీడి పోవలసి వచ్చింది. భూలోకానికి వెళ్తే నేను, మిమ్ములను అజ్ఞానంలో మరచేపోతాను. ఇది జరుగకుండా ఉండే పద్ధతి చూడండి స్వామీ! దయార్ద్రహృదయా! నన్ను రక్షించండి" అని ఎలుగెత్తి ప్రార్థించాడు. 'నా అజ్ఞానాన్ని మన్నించి మళ్లీ నన్ను మీ కొలువుకు తీసుకొని పోండి' అని ప్రార్థించాడు. శివుడు అనుగ్రహించి ఆవరం ఇచ్చాడు.

సుందరారు భూలోకంలో జన్మించటానికి ఇంకో కారణం గూడ వుంది. అందరికి సుందరారు కాముకత్వమే అతని పతనావస్థకు, కైలాసం వీడి పోవలసి వచ్చుటకు కారణ మనిపించవచ్చు. అది కాదు. ఇది భగవంతుని లీలయే. గౌరీశంకరుడు సుందరారుచే మానవుల శ్రేయస్సుకై - తిరుతొండ తొగై పాడించుకోదలచాడు. అందుకని సుందరారు మానసములో ప్రవేశించి ఆ యిద్దరు యువతులపై ఆకాంక్షరేకెత్తించాడు. పైగామానవు లకు ఒక గుణపాఠం నేర్పాలని గూడ శంకరుడు వాంఛించాడు. సుందరారు వంటి మహాభక్తుని గూడ - అతను జాగ్రత్తపడకపోతే - కామం బలవత్తరమైంది - అతనిని వశ పరచుకోగలదు, మాయ మనుజుల కళ్లను కప్పివేస్తుంది. ఈ జిగీషను మొదట్లోనే తుం చకపోతే, కాల్చివేయలేకపోతే - జీవుడు శివుని చేరలేడు. అయినా ఇంకో పాఠం. కాముక దృష్టి సుందరారు భూలోకవాసానికిదారి తీసింది. అయినా జీవితమును పరమాత్ముని సేవలో వినియోగిస్తే - దేవాలయాలను దర్శించటం, దైవంపై ఎనలేని భక్తి ప్రపత్తులు, యోగుల సందర్శనం, పురాణపఠనం - వీటిలో నిమగ్నమైయుంటే - ఆ దృష్టే మళ్లీ జీవు ని పరమాత్మ సన్నిధికి చేరుస్తుంది.

అందుకని సుందరారు అరూరార్‌గా భూలోకంలో తిరునావలూరులో జన్మించా డు. ఆ దేశపురాజు నరసింగ మునైయారు. మునైయారు - అందంగా నున్న సుందరా రును చూడటం తటస్థించింది. అందంగా నున్న ఆ శిశువుని చూచి మోజు పడ్డాడు. శిశువంటే ఇష్టపడ్డాడు. తాను ఆ శిశువుని పెంచుకోవాలనుకున్నాడు. తల్లిదండ్రుల అను మతిని అర్థించాడు. తండ్రి శడయనాయనార్ మహాభక్తుడని ముందే చెప్పాము. అతను భక్తి తత్పరతలో ప్రలోభాలనన్నింటిని దాటాడు. అన్నిటి మీదా కోరికలను త్యజించాడు. అందు చే రాజుగారి కోరికను వెంటనేమన్నించాడు. దరిమిలా కాలంలో ఈ తల్లిదండ్రులు గూడ మహాభక్తులుగా నాయనారులుగా భాసించారు. (62, 63 నాయనారులు).

పిల్లవాడు రాజుగారి పోషణలోగూడ బ్రాహ్మణ ధర్మము విడువక వేదవేదాంగము లనభ్యసించి పెద్దవాడయ్యాడు. యుక్తవయస్సు వచ్చింది. తల్లి దండ్రులు పిల్లవానికి వివా హము నిశ్చయించాలనుకున్నారు. శడయనార్ సందకవి శివాచారియర్ (షడంగవిశ్వా చారి) కుమార్తెను అరురారుకు అడిగాడు. ఆయన వెంటనే ఒప్పకున్నాడు. అందరి అంగీ కారమయినా పెళ్లి జరుగలేదు.

పెళ్లి నిశ్చయమయింది. మూహూర్త సమయం సమీపించింది. తాళిగట్టబోతుంటే - ఒక వృద్ధ బ్రాహ్మణుడు ఒడలంతా విభూతితో మెడచుట్టూ రుద్రాక్షతో జడముడితో ప్రత్యక్షమయి పెండ్లిని ఆపాడు. ఇలా అన్నాడు. "అరూరార్ నా బానిస.  నా బానిసయినట్లు వ్రాత పూర్వకమయిన సాక్ష్యమున్నది. దానిని సుందరారు తాతగారు వ్రాసి యిచ్చారు. అందుచే సుందరారు వివాహమాడటానికి వీలులేదు" అన్నాడు. దానితో వివాహము ఆగిపోయింది. సుందరారు, ఆ బ్రాహ్మణుడు ఆవూరు వదలి వెళ్లారు. కన్యమాత్రము మనసంతా సుందరార్ పవిత్ర పాదాల పైపెట్టుకొని,  దిగులుతో తనువును వీడి కైలాసానికి చేరుకుంది.

సుందరారుకి ఆ వృద్ధ బ్రాహ్మణునకు పెద్ద తగాదా అయింది. సుందరారు ప్రశ్నించాడు. "నీవెవరివి ? ఎక్కడనుంచి వచ్చావు ?' ఆ బ్రాహ్మణుడు అన్నాడు 'నేను తిరువెన్నయినల్లూరు వాడిని'.  సుందరారు 'నీవు పచ్చి అబద్ధాల కోరువు - పద ఇద్దరము తిరువెన్నయినల్లూరు వెళ్దాము. అక్కడ పెద్దల దగ్గర మన వివాదము పరిష్కరించుకొందాము' అన్నాడు. తిరువెన్నయి నెల్లూరు లో పెద్దలు విజ్ఞులు ముందర వృద్ధ బ్రాహ్మణుడు ఆ వ్రాత పత్రాన్ని చూపాడు. అందులో ఇలావుంది. "తిరునావలూరున ఉండు ఆదిశైవుడగు ఆరూరాఖ్యుడు అనునేను తిరువెణ్ణె నల్లూరు పితకు వాని వంశపారంపర్యముగా దాస్యము చేయుటకు త్రికరణ శుద్ధిగా అంగీకరించి ఈ పత్రము వ్రాసి యివ్వడమైనది".

'పిత' అంటే ఎవరోకాదు. సాక్షాత్తు శివుడే. తనను ఓపిచ్చివాడుగా పిలిస్తే శివుడు ఆనంద భరితుడయ్యాడు. మహోన్నతుడైన యోగిలో ఒక రకమయిన ఉన్మాదము కన్పిస్తుంది. ప్రపంచంలో విజ్ఞులు, యోగులు సత్యముకై పిచ్చివాళ్లుగా గోచరిస్తారు. ఆ పత్రములోని సాక్షులను విచారించిన మీదట, సుందరారు తాతగారి సంతకము పోల్చిచూచిన మీదట అచ్చటనున్న సభలోని పెద్దలు ఆ పత్రాన్ని ధృవీకరించారు. సుందరారు దైవాజ్ఞను అంగీకరించవలసి వచ్చింది. ఆ వృద్ధ బ్రాహ్మణుడు సుందరారుని, అతని వెంట ఆ పెద్దలందరిని వాళ్లకి తన ఇల్లుచూపుతానని ఆవూళ్లోవున్న తిరు అరుల్తురాయి అనే దేవాలయంలో ప్రవేశించి అంతర్ధానమయ్యాడు. అరూరారుకు వెంటనే తెలివి వచ్చింది. సాక్షాత్తు పరమ శివుడే ఆ వృద్ధ బ్రాహ్మణుడు. తనను సంసార శృంఖలాలనుండి తప్పించటానికే ఆ వృద్ధ బ్రాహ్మణ వేషములో వచ్చి ఇంత పని చేశాడు. ఆయనను గుర్తించలేకపోయినందులకు సుందరారు బహుదుఃఖించాడు. బిగ్గరగా ఏడ్చాడు. పరమశివుడు ప్రత్యక్షమై, 'నీవు మనుష్యుడుగా పుట్టకమునుపే ఈ వరకే నాప్రియ భక్తుడవు. నీపూర్వజన్మలో నాతోనే కైలాసంలో వుండేవాడివి. చిన్న తప్పిదము నిన్ను భూలోకంలో పడవేసింది. అందుకని నేనే నిన్ను రక్షించ టానికి ఇక్కడకు వచ్చాను' అన్నాడు.

సుందరారు ఆయనతో దెబ్బలాడాడు కాబట్టి పరమశివుడు సుందరారుని నీవు వంతోండన్వి అన్నాడు ( పరుషవాక్యములు పల్కిన భక్తుడవు.) నీవు ఇకనుంచి నన్ను కీర్తించు.  అబ్బాయి నీవు నన్ను పితన్ (పిచ్చివాడివి) అన్నావు. అందుకని పితన్ అనే మొదలు పదముతో పద్యాలు అల్లి పాడు అని కోరాడు. పిత పిరాయి సూడి అనే పరవశింపజేసే పాటకు ఇది కారణమైంది. పరమశివుని తడుత్తకొండ ఈశ్వరుడన్నాడు. (సంసారము నుండి పరిరక్షించినదైవము).

భక్తి ప్రపత్తులతో భక్తి పాటలు పాడుకుంటూ సుందరారు అనేక దేవాలయము లను సందర్శించి అచ్చటచ్చట వెలసియున్న మహేశ్వరులను పద్యములతో వినుతించాడు. అలా సంచారములో సుందరారు భక్త అప్పారు కొలిచిన విరాట్టేశ్వరార్‌ను సమీపించాడు (అదిగై విరాట్టనం). అప్పరారు ప్రదేశమైన ఆస్థలంలో తనకాలుపెట్టినడవటం అపరాధంగా, అపవిత్రంగా భావించి పొలిమేరలోనే వుండిపోయాడు. ఆ రాత్రి సుందరారు నిద్రిస్తున్న సమయంలో దేవదేవుడు ముసలివాని రూపంలో వచ్చి సుందరార్ ప్రక్కనే నిద్రిస్తునట్లు కన్పడ్డాడు. నిద్రావస్థలో అన్నట్లుగా సుందరారు తలపై తనకాళ్లుంచాడు. సుందరారు తీక్షణంగా తన అభ్యంతరము తెల్పాడు. వృద్ధుడు తన అపరాధమునకు క్షమించమని కోరి ఇంకోమూల నిద్రించుటకు ప్రయత్నించాడు. అక్కడ గూడ ఇదే సంఘటన జరిగింది. సుందరారు ఆగ్రహించలేదు. మర్యాదగా ఆ వృద్ధుని గూర్చి అతని విపరీత ప్రవర్తనకు కారణమడిగాడు. 'సఖుడా! నీవునన్ను ఎరుగవా ?' అని ప్రశ్నించి ఆవృద్ధుడు మాయమై పోయాడు. సుందరారుకు మళ్లీ తాను దైవాన్ని గుర్తించలేకపోయానని అర్థమైంది. ఆ గుడిలోనికి వెళ్లితాను దర్శనము చేయలేకపోయినందులకు ఆ దేవుడే శివుడే తన దగ్గరకు వచ్చాడు. వెంటనే సుందరారు పరమశివుని తిరువడి పరమేశుని పద్యాల లహరితో నభిషేకించి “ఓ దేవదేవా! నీవెంత దయార్ధహృదయుడవు ! వేదాలు, ఆగమాలలో నిష్ణాతులైన వారు గూడ నీ పాదాలను తాకజాలరు. కేవలము ఈ హీనుని పై ప్రేమతో నీ స్థలమును విడిచి నీ పాదకమలములతోనన్ను అనుగ్రహించుటకు వచ్చితివా తండ్రీ !' అంటూ దేవదేవుని సుందరారు వినుతించాడు.

సుందరార్ తన తీర్థయాత్రను కొనసాగించాడు. తిల్లై (చిదంబరము) చేరుకొని దేవాలయ గోపురాన్ని చూడగానే తన్మయుడైపోయాడు. ఆ తన్మయత్వంలో గద్గదుడై భాష్పాలు చిలికిస్తూ నేలపైపడి దొర్లాడు. నటరాజస్వామి దర్శనమిచ్చాడు. 'నీవు తిరువారూరు వెళ్లవలసింది'గా సుందరారును ఆజ్ఞాపించాడు.

త్రోవలో ఎన్నో దేవాలయాలు సందర్శిస్తూ సుందరారు తిరువారూరు చేరుకున్నాడు. కమలాలయమున వెలసియున్న వల్మీకనాథుడు 'నా పరమ భక్తుడైన సుందర మూర్తి వచ్చుచున్నాడు, మీరందరూ ఎదురుపోయి తోడుకొని రావలసినది, ఆలయ మర్యాదలతో తీసికొని రావలసినదని' అచ్చటి బ్రాహ్మణులకు కన్పించి చెప్పాడు. వారు అట్లే చేశారు. సుందరారు దేవుని అర్చిస్తున్న సమయంలో ఒక వాణి 'సుందరార్ - నిన్ను నా మిత్రునిగా ఎంచుకున్నాను. ఇంతకుమునుపు నిన్ను వివాహము చేసికొనకుండా అడ్డుకున్నాను. ఇకనుంచి వరునిగా వర్ధిల్లు'మని వినిపించింది. సుందరార్ వివాహ యోగ్యుడయిన వరునిగా తక్షణమే రూపొందాడు. తిరువారూరులో పరవయార్ అనే మహాశీలవంతురాలైన యువతి ఉంది. ఆమె ఎవరో కాదు. పూర్వజన్మలో కైలాసంలో పార్వతిదేవి దగ్గరున్న కమలిని యే. ప్రతిదినము ఆమె (పరవయార్) దేవాలయమునకు వెళ్లి వల్మీకనాథుని త్యాగీశుని అర్చించి భక్తి శ్రద్ధలతో దేవుని నుతిస్తూండేది. ఒక దినమున ప్రతిరోజూ వచ్చే పద్ధతి ప్రకారమే తన చెలులతో దేవుని అర్చించడానికి వచ్చింది. ఆ సమయానికే సుందరారు ఇతర భక్తులతో దేవళములో ప్రవేశించి ఆమెను చూడగానే గత

జన్మ సంస్కారమువలని కాబోలు - ఆమె అందాన్ని చూచి ఆమె యెడల ఆకర్షితుడై నాడు. ఆమెను వివాహమాడాలని తలంపుతో దేవళంలో అడుగుపెట్టాడు. పరమేశ్వరుడు ఆతని సఖుడు గదా! ఆయనతో తన కోరిక వెల్లడించుకున్నాడు. పరవయారు గూడ ఇత నిని చూడగానే ఆకర్షితురాలైంది. వివాహము చేసికొన తలంపు ఆమె మదిలో మెదిలిం ది. పరమ శివుడే ఈ వివాహము జరుగ నిర్ణయించినాడు. అది ఆయన బాధ్యత గూడ అయింది. పరమేశ్వరుడు ఇద్దరకు కలలో కనిపించి - మీ వివాహము తధ్యమన్నాడు. తన భక్తులకు కూడా కలలో కనిపించి వారిద్దరి వివాహము మరుసటి దినమే జరు పమని ఆదేశించాడు. పరవయారు సుందరారుల ఆనందానికి అవధులు లేనట్లుగా వివాహము జరిగింది.

ఒక రోజున అరురార్ గుడిలోకి వెళ్లగా సహస్ర స్తంభ మంటపమున అక్కడ చాలా మంది భక్తులు కనిపించారు. సుందరారు 'వీరిని ఎట్లు సేవింపగల్గుదును' అని చింతించు చుండగా వల్మీకనాథుడు అతని భావవీధిని సాక్షాత్కరించి 'పద్యములతో  వీరిని వినుతిం పుము నీ అభీష్టము నెరవేరును" అని యానతిచ్చెను. సుందరారు వల్మీకనాథుని వల్ల గురుప రంపర నెఱిగి ఆ భక్తగణమును వినుతించాడు. దేవునిమీద పద్యాలు అల్లి పాడదలిచాడు. దేవుడే తిరుతొండతోగై పాటకు తొలి చరణాన్ని పాడాడు. మహాదేవుని కృపతో సుందరారు దానిని పూర్తిచేశాడు.

తిరువారూరులో వున్నపుడు కుండైయూర్కిజారు అనే ఆయన సుందరారు మీద భక్తితో పరవయారు సుందరారు కుటుంబమునకు ఆయన అనుచరులకు సరిపడే భోజన పదార్థాలు ఇచ్చేవాడు. ఇంతలో దేశంలో కరువు వచ్చింది. ఎవరికీ ఆహార పదార్థా లు లేక పోయాయి. కుండైయూర్కిజార్ గూడ నకనకలాడాడు. సుందరారుకు ఆహార పదార్థాలు ఇవ్వలేకపోతున్నందుకు ఆయన గుండె కొట్టుకుంది. పరమశివుడు అతని కల లో ప్రత్యక్షమై, 'దిగులు చెందకు, కుబేరుణ్ణి ఆదేశించాను, నీకు కొఱత యుండదు' అని చెప్పాడు. మరుసటి ఉదయం కిజారు తనకై పెద్ద ధాన్యపు కుప్పలు చూచాడు. సుందరా రు కుండెయూర్కిజార్ను కలుసుకోబోయాడు. ఆ సమయంలో కుండైయూర్కిజార్ గూడ సుందరారు దగ్గఱకు బయలుదేరాడు. ఇద్దరూ మార్గమధ్యంలో కలుసుకున్నారు. సుందరారు ఆ ధాన్యపు కుప్పలను చూచాడు. పరమేశ్వరుడి లీల అని గ్రహించాడు. వెం టనే దగ్గరలోనున్న దేవళమునకు వెళ్లి పరమశివుని నుతించాడు కీర్తించాడు. ఆ ధాన్యా న్ని తిరువారూరుకు చేర్పించవలసిందిగా సుందరారు పరమశివుని కోరాడు. అట్లే జరు గుతుందని దివ్యవాణి వినిపించింది. పరవయారుకు ఆ సంగతి సుందరారు చెప్పాడు. మహాదేవుని భూతగణాలు ఆ ధాన్యానంతా తిరువారూరుకు చేరవేశాయి. తిరువారూరం తా ఆ ధాన్యపురాసులతో నిండిపోయింది. పరవయారు ముగ్ధురాలై దేవదేవునికి అనంతం గా పదే పదే ప్రణామాలు అర్పించింది.

ప్రజలనందరిని వారికి సరిపడా ధాన్యాన్ని తీసుకు వెళ్లవలసిందిగా వాళ్ల ఆకలి తీరేటట్లుగా చూచింది. ఈ విధంగా కరువుగూడ సమసిపోయింది. ప్రజలంతా దేవదేవు ని, పరవయారును వేనోళ్ల కొనియాడారు.

చోళరాజు ప్రధాన సైన్యాధికారి తిరునాట్యత్తాన్ గుడి వాసి అయిన కొట్పులి నాయనార్ మహాశివభక్తుడు. సుందరారు వద్దకు వెళ్లి సవినయంగా తన ఇంటిని పావనము చేయమని అర్థించాడు. సుందరారు ఆహ్వానాన్ని మన్నించి ఆయన ఇంటికి వెళ్లాడు. ఆయన సుందరారుని పూజించి తన ఇద్దరు కుమార్తెలతో (సింగడియారు, వనప్పహైయారు) ఆయన కాళ్ల మీద పడి ఆ ఇద్దరు తనయులను వివాహము చేసికొమ్మని అర్థించాడు. సుందరారు వాళ్లని తన తొడలమీద కూర్చోబెట్టుకొని, వాళ్లని తన స్వంత కుమార్తెలుగా లాలించాడు. దేవళమునకు వెళ్లి సుందరారు దేవుని నుతించాడు. ఆ నుతిలో తనను సింగడియప్పనుగా పేర్కొన్నాడు. సింగడియారును కూతురుగా భావించినందుకు సింగడియప్పన్‌గా పిలుచుకొన్నాడు.

తిరువారూరు తిరిగివెళ్లాడు. పంగుణి ఉత్తరమ్ (ఫాల్గునోత్తరము) పండుగరోజున ధనమును, ఇతర వస్తువులను దానమిచ్చుట పరవయార్‌కు ఆచారము. సుందరారు తిరుపుగలూరు వెళ్లి శివుని పరవయారు కొఱకు సువర్ణమును అర్థించాడు. ఆ రాత్రి అచటనే నిద్రించాడు. తలగడగా కొన్ని ఇటుకలను పెట్టుకొని నిద్రించాడు. ప్రొద్దున్న లేచిచూచేసరికి ఆ ఇటుకలు బంగారు ఇటుకలైనట్లు గమనించాడు. ఈ అద్భుతానికి సుందరారు దేవుని నుతించి తిరువారూరు చేరాడు. త్రోవలో తిరుపనైయూరులో శివుడు సుందరారుకి దర్శనమిచ్చాడు. చాలా దివ్య స్థలాలని సందర్శిస్తూ భగవంతుని నుతిస్తూ కీర్తిస్తూ సుందరారు తిరుపచిలాశ్రమముకు చేరాడు. అక్కడ శివుని నుతించి ఒక బంగారునాణెమిమ్మని కోరాడు. దేముడు వెంటనే ఈయలేదు. అందుకని మళ్లీ ఒక పడిగము(పాట) పాడాడు.

శివుడు వెంటనే సువర్ణముల రాశినే ఇచ్చాడు. సుందరారు పాటలంటే శివునికి అంత మోజు ఏర్పడింది.

సుందరారు వృద్ధాచలమునకు బయలుదేరాడు. త్రోవలో తిరుకూడలైయార్రూరు దేవుడిని చూచుట తటస్థించలేదు. శివుడు ఒక బ్రాహ్మణ రూపంలో రాగా, అతనిని సుందరారు వృద్ధాచలమునకు త్రోవ అడిగాడు. త్రోవ చూపుతున్నట్లు కొంతదూరము తీసికొని వెళ్లి అచ్చట ఆ వృద్ధుడు మాయమయ్యాడు. తిరుకూడలైయార్రూరు ఆ ప్రదేశమునకు సమీపముననే యున్నది. సుందరారు అది గమనించి ఇప్పుడు ఆ మహాదేవుని చూచాడు. సుందరారు మహాభక్తితో శివుని నుతించాడు.

చివరకు వృద్ధాచలము చేరాడు. అచ్చట దేవుని అర్చించి పడిగమును పాడి సువర్ణ నాణెములకై అర్థించాడు. శివుడు అతనికి 12 వేల బంగారు నాణాలను అనుగ్రహించాడు. ఆ బంగారు నాణెములను తిరువారూరుకు చేర్పించ వలసినదిగా శివుని కోరాడు. 'ఆ నాణెములను ఇచ్చట మణిముక్తనదిలో బడవేయుము. పోయి కమలాలయము నందలి చెరువులో వెదకికొనుము' అని దివ్యవాణి వినపడినది. సుందరారు ఆ పనిచేశాడు.తిరువారూరులో కమలాలయము చెరువులో ఆ నాణాలు తూర్పువైపున నున్నట్లు భావించి వెదుకగా దొరకలేదు. బాధాహృదయుతో ఒక భక్తిగీతాన్ని పాడాడు. భగవంతుడు కోరుకున్నది గూడ ఆ పాటనే. సుందరారుకి నాణాలు కన్పించాయి. కాని తన దగ్గరనున్న మచ్చు నాణెముతో పోలిస్తే వాసి

తగ్గినట్లనిపించింది. అందుకని సుందరారు మళ్లీ పాడాడు. ఆ బంగారు నాణాలు స్వచ్ఛమైన నాణాలుగా వన్నెతో భాసించాయి. సుందరారు పాటలంటే శివునికి తనివి ఎక్కువైంది. అంతగా మురిసిపోయేవాడు.

సుందరారు మఱల శివస్థలములను సేవించటానికి బయలుదేరాడు. మార్గమధ్యమున ఒకచోట అన్నపానములు దొరకలేదు. ఆకలిదప్పికలు ఆవహించాయి. అందరి హృదయాల్లో ఉండే దేవదేవుడు బ్రాహ్మణ వేషముతో ఒక పందిరిని కల్పించి సుందరారు కోసము వేచియున్నాడు. సుందరారు, భక్తులు పంచాక్షరిజపంతో పందిరిలో ప్రవేశించారు. బ్రాహ్మణుడు వీళ్లకి కడుపునిండా భోజనము పెట్టి దప్పిక తీర్చి - వీళ్లని విశ్రాంతి తీసుకోమన్నాడు. వారెంత తిన్నా ఆహార పదార్థాలు ఏమాత్రము తగ్గలేదు. వీళ్లు విశ్రాంతి తీసుకొనుచుండగా ఆ బ్రాహ్మణుడు అంతర్ధాన మయ్యాడు. అతడు పరమ శివుడేనని అంతా గుర్తించారు. సుందరారు పరమేశ్వరుని పద్యలహరితో ప్రస్తుతించాడు. హృదయరంజకంగా పాడాడు.

ఈ సంఘటన అయిన కొంతకాలమునకు తిరుకాచూరు (పక్షితీర్థము) వెళ్లి, అక్కడి గుడిలో దేవుని అర్చించి దేవాలయము బయట విశ్రాంతి తీసికొనుచుండగా ఆకలయింది. భగవానుడు ఇది గుర్తించాడు. అందుకని ఒక బ్రాహ్మణరూపంతో సుందరారుని సమీపించి 'మీరు ఆకలిగొన్నట్లుగా వున్నది. ఇక్కడ కొంచెం సేపు విశ్రాంతి తీసుకొనండి. బ్రాహ్మణుల ఇంటికి పోయి అన్నము యాచించి తెచ్చెదను" అని ఆ మండుటెండలో వెళ్లి ప్రతి ఇంటిలోను బిక్షనడిగి, అట్లా సేకరించిన ఆహారమును సుందరారు కిచ్చాడు. సుందరారు, ఇతర భక్తులు ఆహారము తీసికొనుచుండగా ఆ బ్రాహ్మణుడు అంతర్హితుడైయాడు. అది చూచి సుందరారు సాంబశివుడే ఈ వేషమున వచ్చెనని ఎరింగి మరల కవితా లహరిని ప్రవహింపజేసాడు. భగవత్ కటాక్షమును ముచ్చటగా పాడాడు.

తర్వాత తిరువిత్రియారు వెళ్లి అక్కడ భగవంతుని అర్చిస్తూ కొంత కాలమున్నాడు. కైలాసంలో పార్వతీదేవి ఇంకొక సేవకురాలైన అనిందితియార్ గూడ తొండైనాడులోని జ్ఞానయారులో సంగ్లియార్‌గా జననమెత్తింది. ఆమె తండ్రి జ్ఞానఈరు కిజారు వెల్లాల కులస్థుడు. ఆయనగూడ పరమ శివభక్తుడు. సంగ్లియారు చిన్నతనము నుండే పార్వతీదేవిని అర్చించ మొదలుపెట్టింది. ఒకరోజున తల్లిదండ్రులు ఆమెకు వివాహము తలపెట్టబోతే ఆమె మూర్ఛిల్లింది. తర్వాత వెల్లాల కులంలోని ప్రముఖుడొకడు ఆమెను వివాహమాడతలచి తన తరపున మాట్లాడమని తన అనయాయులను పంపాడు. జ్ఞాన ఈరుకు ఈ విషయమై కూతురుతో మాట్లాడటానికి యిష్టం లేకపోయింది. అందుచే ఏదో చెప్పి వాళ్లను పంపివేశాడు. సంగ్లియారును వివాహమాడదలంచిన వ్యక్తి, ఆతని అనుచరులు గూడ ఏదో కారణంతో చనిపోయారు. తండ్రి 'ఈమెను శివభక్తుడే కాని అన్యుడు పెండ్లియాడదగడు' అని నిశ్చయించుకొని, ఆమెను తిరువత్రియూరుకు తీసికొని వెళ్లి ఒక చిన్ని ఆశ్రమము నిర్మించి ఆమెను అక్కడకు చేర్చాడు.

సంగ్లియారు అచ్చట - భక్తి ప్రపత్తులతో పుష్పమాలలు గ్రుచ్చివానితో స్వామిని సేవించుచుండేది. ప్రతిదినము దేవాలయమునకు వెళ్లి పూలమాలలు సమర్పించి అర్చించి

వచ్చేది. ఒకరోజున సుందరారు, భక్తులు ఆ దేవాలయమునకు వెళ్లారు. దేవుని అర్చనలు పూర్తయి బయటకు రాగా పూతచరితలు స్వామికి దండలు తయారు చేయుచుండుట చూచారు. సంగ్లియారు కూడా ఆ సమయమున అచ్చటనే యున్నది. ఆమె అందానికి సుందరారు ఆకర్షితుడయ్యాడు. పరమేశ్వరునికి ఈ విషయము తెలియపరచి, ఆమెను వివాహమాడ తన సంకల్పమును చెప్పి అందుకు తోడ్పడమన్నాడు. భగవానుడు ధైర్యం చెప్పాడు. ఆమె కలలో కనిపించి "పవిత్ర హృదయా ! నీ భక్తి ప్రపత్తులకు చాలా సంతోషంగాయుంది. ఇప్పడు నీ మంచికి చెబుతున్నాను. సుందరారు నిన్ను వివాహమాడాలనుకుంటున్నాడు. అతడు నాకు పరమ మిత్రుడు. మీ ఇద్దరి వివాహము జరిపించవలసిందిగా నన్ను కోరాడు. నీవు అంగీకరించు సుఖపడతావు' అన్నాడు. సంగ్లియారు దేవదేవునికి సాష్టాంగ ప్రణామమాచరించి "దేవా! మీరు ఆజ్ఞాపించినట్లు అతణ్ణి వివాహమాడతాను. కాని అతను నన్ను విడిచిపెట్టేయవచ్చు. అతనికి ఈ వరకై వివాహమయి వున్నది' అన్నది. 'ఏ సందర్భములోనూ నిన్ను వీడనని" సుందరారునుండి వాగ్దానము తీసికొనవలసినదని శివుడు సలహా యిచ్చాడు.

సుందరారుకు శివుడు కనపడి - 'సంగ్లియారు - ఒక షరతుతో - నీవు ఎన్నడు ఆమెను విడువనని ప్రమాణము చేసిననే, నిన్ను ఆమె వివాహమాడగలదు' అని చెప్పాడు. సుందరారు "అయ్యో! నేను ఎట్లా ప్రమాణము చేసేది. నేను అన్నివూళ్లు, అన్ని గుళ్లు తిరుగుతుంటాను గదా' అన్నాడు. అని - 'సరే నేను ప్రమాణము చేస్తాను. నేను ప్రమాణము చేయుచున్నప్పడు మీరు దేముని గుడిలోని లింగము నుండి వైదొలగి ప్రక్కనున్న చెట్టులో వుండినచో - ప్రమాణము చేయుదును' అన్నాడు. శివుడు సరేనన్నాడు.

సంగ్లియారుకు శివుడు కన్పించి 'సుందరారు ఒప్పకున్నాడు. కాని అతని ప్రమాణమును శివలింగము ఎదుట కాకుండా దగ్గరయున్న చెట్టు ముందర చేయవలసినదిగా కోరుము' అన్నాడు.

మరునాడు ప్రొద్దున్న సంగ్లియారు గుడికి వచ్చింది. సుందరారు అప్పటికే ఆమె కొఱకు వేచియున్నాడు. సంగ్లియారు చెలి కత్తెలు "మీరు ఆ ప్రమాణమును లింగము ముందు కాక దగ్గరనున్న చెట్టు ముందర చేయుటయే ఆమె కోరిక" అన్నారు. అతను ఒక్కసారి నిశ్చేష్టితుడయ్యాడు. ఆగి - సరేనన్నాడు. ఆ ప్రమాణమును చెట్టు ముంగిల చేసినాడు. వెంటనే వివాహము జరిగినది.

తిరువారూరులో వల్మీకనాథుని వసంతోత్సవము మహావైభవవంతంగా జరుగుతుంది. సుందరారుకు ఆ వసంతోత్సవము జ్ఞప్తికి వచ్చింది. అక్కడకు వెళ్లవలయునని తలచాడు. దేవుని ముంగిట పరవయారు పాడుతుంది నాట్యమాడుతుంది. సంగ్లియారును వదలి వెళ్లలేడు. కర్తవ్యముకై కొట్టుమిట్టాడాడు. చివఱకు సంగ్లియారును వదలి వెళ్ళటానికే నిశ్చయించాడు.

ఇచ్చిన మాట తప్పటచే - తిరువత్రియారును దాటగానే - సుందరారు దృష్టిపో

యింది. భూమిమీద పడ్డాడు. భగవంతుడు నిష్పక్షపాతి. దైవనిర్ణయము ఎవరును ఉల్లంఘించలేరు. సుందరారుకు స్పృహ వచ్చింది. తన తప్పును తెలుసుకున్నాడు. భగవంతుని క్షమించమని, చూపునివ్వమని అర్థించాడు. “దేవా! నీవే శరణ్యమవు. నీ పేరే సదా ఉచ్చరిస్తాను. నేను చూపుబాసి నేలకొఱగుతున్నప్పుడు గూడ నీపేరే తలచాను. కరుణామూర్తీ! నేను తప్ప చేసినా, నన్ను క్షమించుట నీ విధి గదా! దయార్ద్ర హృదయుడా! నన్ను రక్షించు” అని వేడుకున్నాడు. కళ్లుపోయినా తిరువారూరులోని దైవమును చూడాలన్న తపన అతనిని వీడలేదు. కొంతమంది సహాయముతో తిరుముల్లై వాయిలు చేరుకున్నాడు. ఇక్కడ గూడ దేవుని తనకు దృష్టినీయమని ప్రార్థించాడు. తిరువెంబాక్కములో అదే విధముగా మళ్లీ దేవుని ప్రార్థించాడు. గుడిలో ‘దేవా! నన్ను నీ ఆంతరంగికులలో చేర్చుకున్నావు, నీకు ప్రణామములు. నా మీద యుక్తి పన్నావు. నీవు గుడిలోనే వున్నావా?” అని ఎలుగెత్తి అడిగాడు. “ ఆ! నేను ఇక్కడనే వున్నాను. నీవు వెళ్లవచ్చు” అని కఠినంగా దేవుడు జవాబిచ్చాడు. జవాబిస్తూ గుడ్డివాళ్లకుపయోగపడు చేతికఱ్ఱనందించాడు. దైవము యొక్క నిర్లిప్తత సుందరారును బాధపెట్టింది. తనమీద కారుణ్యము చూపుమని అర్థించాడు. ‘దేవా! నిన్నే నమ్ముకున్నాను. నీవే నాకు సహాయకారివి. నేను నీవు క్షమిస్తావని ఈ తప్ప చేశాను. ప్రజల విమర్శకు నీవు అతీతుడవు. నీ పాదాలపైబడి ఏడుస్తున్న భక్తుని నీవు వినకపోతే, క్షమించపోతే అందరూ నిన్నుగూర్చి ఏమనుకుంటారు? ఎలా తలుస్తారు?

తప్పఒప్పకున్న భక్తుని గూడ క్షమించకపోతే ఎలా? దేవా! నా బాధ నీవు అర్థము చేసుకోలేవా? తల్లిని వీడిన పాప తల్లిదగ్గరవగానే అమ్మను గట్టిగా పట్టుకొని దగ్గరయినట్లు నేను నీ దగ్గఱకు వచ్చాను. తల్లివలె లాలించుటకు బదులు నీవు నన్ను పరాయి వాణ్ణిగా చేస్తున్నావు. దేవా! ఒకవిధంగా నన్ను నీవు మోసంచేశావు. నేను నిన్ను ప్రమాణమప్పడు దూరంగా చెట్టు దగ్గర వుండమని కోరాను. ఈ విషయం నీవు సంగ్లియారుకు చెప్పి నన్ను మోసం చేశావు. సంగ్లియారుకు అన్ని సుఖ సంతోషాల్ని ఇచ్చావు. నీవు నాకు ఇప్పడు గుడ్డివాని చేతి కఱ్ఱను ఇస్తున్నావు. పైగా ‘నీవు వెళ్లవచ్చు’ అంటున్నావు. నీ కరుణకు నేను నోచుకోనా? అనర్హుడనా? నన్ను క్షమించు. నా బాధనుండి విముక్తుణ్ణి చేయుమని ’సుందరారు దేవుని ప్రార్థించాడు.

దైవానికే బాధ్యత అంతా విడిచిపెట్టి సుందరారు కంచికి (కంజీవరము) చేరుకున్నాడు. దోవలో అన్ని దేవాలయాలకు వెళ్లాడు. కంచిలో తల్లి కామాక్షిని తనను బ్రోవుమని అర్థించాడు. ఏకామ్రేశ్వరస్వామిని బహుధా అర్చించాడు. ఆయన ప్రక్కన ఆసీనురాలైవుంది తల్లి కామాక్షిదేవి. సుందరారు అభ్యర్థనలకు ఆమె చలించింది. తన కృప చూపాలనుకుంది. శివుడు దీనిని గ్రహించాడు. సుందరారుకు వెంటనే ఎడమ కన్నుకు చూపును అనుగ్రహించాడు. ఆనంద భాష్పములతో పరవశముతో సుందరారు దేవుని నుతిస్తూ భూమిపై పడి దొర్లాడు. కొన్ని రోజులు కంచిలో వుండి దేవుని నుతిస్తూ - సుందరారు తిరువారూరు బయలుదేరాడు. తిరువాదూతుర్రై లో రెండవ కన్నుకు గూడ దృష్టి నివ్వమనిదేవుని కోరాడు. తిరుత్తూరితి చేరగానే శివుడు ఉత్తరము దిశలోనున్న చెఱువులో స్నానము చేయుమన్నాడు. సుందరారు స్నానము చేసి బయటకు వచ్చాడు. అందరికి ఆశ్చర్యమయింది. సుందరారు శరీరము మెరుగుపెట్టిన బంగారంగా ప్రకాశవంతమయింది.

సుందరారు గుడిలోనికి వెళ్లి దేవుని కొలిచాడు.

తిరువారూరు పొలిమేరకు సుందరారు చేరాడు. ఒక కన్నుతో దేవుని కనులార చూడజాలను అనుకున్నాడు. గుడిని చూడగానే తన్మయుడయ్యాడు. దేవదేవుని సౌందర్య ము తనివి తీర రెండుకళ్లతో చూడాలనుకున్నాడు. అందుకని దేవుని "రెండవనేత్రము గూడ ప్రసాదించమని' పదేపదే కోరాడు. శివుడు కరిగి, వెంటనే రెండవ కన్నుకు గూడ చూపుననుగ్రహించాడు. సుందరారు దేవుని కరుణకు దైవధ్యాసలో తన్మయుడై ఉండిపో యాడు.

ఇలావుండగా పరవయారు సుందరారును కలియుటకు తన వాళ్లను పంపగా సుందరారు సంగ్లియారును పెండ్లి యాడినటుల తెలిసింది. వాళ్లు తిరిగి వచ్చి పరవ యారుకు ఈ వార్తనందించారు. పరవయారు దుఃఖము పట్టలేకపోయింది. ఆమెకు ఆగ్రహము వచ్చింది. పరవయారు సుందరారు భక్తులను లోనికి రానీయలేదు. సుంద రారు గూడ ఖిన్నుడయ్యాడు. దిగులు చెందాడు. తామిద్దరము పూర్వపురీతిని కలుసు కుందాము అని కబురుపంపాడు. వాళ్లు ఆమెను ఒప్పించలేకపోయారు. సుందరారు అర్ధరాత్రి అందరూ నిదురబోతుండగా శివుణ్ణి తమ ఇద్దరిని కలుపవలసినదిగా మరీ మరీ ప్రార్థించాడు. శివుడు అభయమిచ్చి బ్రాహ్మణ భక్తుని వేషంలో పరవయార్ ఇంటికి వెళ్లి సుందరారును భర్తగా తన యింటికి తెచ్చుకోమని సుందరారు తరపున వాదిం చాడు. ఆమె సుందరారుతో కలిసి వుండ లేకపోతున్నందుకు దుఃఖిస్తూ సుందరారును కలియ నిరాకరించింది. శివుడు తిరిగి వచ్చి సుందరారుకు ఆమె నిరాకరణ తెలిపాడు. సుందరారు దుఃఖముతో మూర్ఛిల్లాడు. 'మీరే సహాయము చేయలేకపోతే నాగతేమిటి? నాకు మరణమే శరణ్యమ" న్నాడు. శివుడు అతనిని ఓదార్చి మళ్లీ ఇంకొకసారి పయత్నిస్తా నని చెప్పి మళ్లీ పరవయారును కలిశాడు. ఈలోగా తన దగ్గరకు వచ్చిన బ్రాహ్మణుడు సాక్షాత్తు పరమశివుడేనని పరవయారు తెలిసికొంది. ఆయనను గుర్తించలేనందుకు తన్ను తాను నిందించుకుంది. ఈసారి తన నిజరూపముతో శివుడు ఆమె దగ్గరకు వెళ్లాడు. పరవయారు వెంటనే ఆయన పాదాల యెడ మ్రోకరిల్లింది. శివుడు "పరవ యార్ - నన్ను సుందరారు మళ్లీ పంపాడు. నీవు నిరాకరించకు. అతను నీ వియోగము తో చాలా క్రుంగిపోయాడు. అతన్ని ఆహ్వానించు" అని చెప్పాడు. ఆమె 'ఓ పరమాత్మా మిమ్ములను ఇంతకు మునుపు గుర్తించలేకపోయాను. మళ్లీ మీరు తిరిగి వచ్చారు. ఈ సారి మీరూపంతోనే వచ్చారు. నాకోసము రెండుసార్లు మా గుడిసెకు వచ్చి - మీ అనంత కృపావిశేషాన్ని చూపారు. దేవా! మీరెంత కరుణామయులు? అర్ధరాత్రి శ్రమపడి మా యింటికి విచ్చేశారు. మిమ్ములను నేను ఎట్లా కాదనేది? మీ ఆజ్ఞను ఉల్లంఘించలేను. శిరసావహిస్తాను" అని నమ్రతతో పల్కింది. పరమశివుడు ముగ్ధుడైనాడు. ఆమెను ఆశీర్వ దించి సుందరారు దగ్గఱకు వచ్చి "పరవయారును ఓదార్చాను. ఆమె అంగీకరిస్తోంది. ఇప్పుడు ఆమె దగ్గఱకు నీవు వెళ్ల వచ్చును" అంటూ అంతర్ధానమయ్యాడు. సుందరారు ఆనందానికి అవధుల్లేక పరవశించి పరమేశ్వరుని విశేషాన్ని గుణించి పాడాడు.

సుందరారు వచ్చే సమయానికి పరవయారు తన ఇంటిని అత్యంత మనోహరంగా

అలంకరించింది. ఆతృతతో అతని రాకకోసం వేచియుంది. సుందరారు తన అనుయా యులతో ఇంటిలో ప్రవేశించాడు. పరవయారు అతని కాళ్లపై పడింది. ఈ విధంగా వారి దీర్ఘ వియోగం అంతమయింది.

ఈ విషయం ఇంతటితో అవలేదు. పరమశివునే సుందరారు తన దూతగా పం పాడన్న వార్త పొన్నినాడులోని తిరుపెరుమంగళం లోని ఇయర్‌కాన్ కలికామనాయనారు చెవిన పడింది. పరమశివుని అంతటివానిని గృహాశ్ఛిద్రములో దూతగా చేసినందుకు సుందరారు మీద కోపము వచ్చింది. సుందరమూర్తిని నిందింపసాగాడు. కలికామనా యనారు కోపము పోగొట్టవలసిందిగా సుందరమూర్తి వల్మీకనాథుని ప్రార్థించాడు. ఈశ్వరుడు కలికామనాయనారుకు తీవ్రమైన శూల రోగమును కల్పించి వృద్ధ బ్రాహ్మ ణరూపంలో అతని చెంతకు పోయి - దీనిని సుందరమూర్తినాయనారు నిర్మూలింపగ లడు, అతనికి తెల్పుము అని చెప్పాడు. కలికామనాయనారు అతడు పాపాత్ముడు, సుందర మూర్తిని చూడజాలను అని బదులు చెప్పాడు. పరమేశ్వరుడు సుందరమూర్తి వద్దకు వచ్చి 'నీవు పోయి కలికామనాయనారు శూలరోగము పోగొట్టుము' అని నియమించెను. సుందర మూర్తి అతని వద్దకు వెళ్లగా కలికామనాయనారు 'వీని మొగము చూడరాదు' అను సంకల్ప ము తో పొడుచుకొని చనిపోయెను. సుందరమూర్తి మహాత్ముడు చనిపోయెను. ఇక నేనెం దులకు? అని పొడుచుకొనుటకు ఖడ్గము ఎత్తెను. అంతట పరమశివుని అనుగ్రహము వలన కలికామనాయరు జీవించి, లేచి సుందరమూర్తిని పట్టుకొని ఆత్మహత్యనుండి మరలించెను. ఇద్దరు స్వామి సన్నిధికి పోయి స్వామిని నుతించారు.

చేరదేశాధీశుడు చేరమాన్‌పెరుమాళ్ సుందరమూర్తిని చూడనభిలషించాడు. వీరిమైత్రీ అనుబంధము ఎలా పెరిగిందో చేరమానుపెరుమాళ్ జీవితగాథలో విపులంగా తెలిసికొందాము.

సుందరారు, చేరమాన్‌పెరుమాళ్ కలిసి మధుర వెళ్తూ తిరునాగైకోరోనమ్ చేరు కున్నారు. అక్కడ పరమశివుని సుందరారు ప్రార్థించి ముత్యాలహారము,రవ్వలు, రత్నాలు, కస్తూరి, నేత్రాలు, గంధము, బట్టలు, నగలు, తిరువారూరులోని ఐశ్వర్యములో మూడవ వంతును, వాయువుతో సమంగా వెళ్లగలిగే అశ్వాల్ని, బంగారు పువ్వులు, పల్లకి మొద లగు వాటిని ఈయవలసినదిగా కోరాడు. భగవంతుడికి భక్తుడికి మధ్య సంబంధం ఎంత అపురూపం! సుందరారు శివుని తన సఖుడుగా భావించాడు. పరమేశ్వరుడు గూడ అదే కోరుకున్నాడు. దేవునితో సఖ్యభావాన్ని సుందరారు పెంపొందించాడు.

దివ్యక్షేత్ర దర్శనమునకై చేరమాన్‌పెరుమాళ్లతో బయలుదేరి అనేక శివస్థలము లలో వివిధ నామములతో వెలసియున్న పార్వతీపతిని సేవించి పద్యజాలములతో విను తించారు. దక్షిణాదిలో పెక్కురాజులను కలుసుకొన్నారు. ఒకరోజున వారు తిరుకండియూ రు లో వుండగా ఆవలి ఒడ్డున తిరువైయారును చూచారు. నదివరదతో పరవళ్లు తొక్కుతున్నది. నదిని దాటటం గగనమైంది. సుందరమూర్తి పరమేశ్వరుని ప్రార్థించాడు ఈశ్వరుని కిష్టమైన పాట నొకదానిని పాడాడు. అంతే ఆ క్షణమే నది వారికి త్రోవ

యిచ్చింది. వారు ఆవలి ఒడ్డుకు చేరగానే త్రోవ మూసుకుపోయి నేల అదృశ్యమైంది. పంచ భూతాలు గూడ దేవుని ఔదలను భక్తులకై శిరసావహిస్తాయి.

ఈ యాత్రలో తిరుచ్చుళి అనే స్థలంలో సాంబుని పద్యాలలో ప్రస్తుతించు చుండ గా ఈశ్వరుడు వృషభారూఢుడై వచ్చి "నేనువుండునది ఇక్కడకాదు కానప్పేరున" అని చెప్పాడు. పిదప సుందరమూర్తి చేరమానుపెరమాళుతో కానప్పేరునకుపోయి స్వామిని సన్నుతించి రామేశ్వరము మున్నగు సకలదివ్యస్థలములను సేవించుకొని తిరువారూరు కమలాలయముకు చేరుకున్నారు.

కొన్ని దినములు గడచిన తర్వాత చేరమాను పెరుమాళ్ సుందరారును తన ఇంటికి సకల మర్యాదలతో తీసికొని వెళ్ళాడు. కొంతకాలం సుందరారు ఆయనతో వున్నా డు. అతనికి అకస్మాత్తుగా తిరువారూరు దేవుడు జ్ఞప్తికి వచ్చాడు. వెంటనే అక్కడకు వెళ్ల నిశ్చయించాడు. చేరమాను పెరుమాళ్ సుందరారుతో కలిసి వెళ్లలేక పోయినందుకు చింతించాడు. సుందరారు ఆయనను ఓదార్చి - చేరమానును అచ్చటనే వుండి చక్కగా న్యాయవంతంగా పరిపాలించవలసినదని కోరాడు. చేరమాను సుందరారుకు సాష్టాం గ పడ్డాడు. సుందరారుకు అనేక వస్తువులను బహుకరించాడు. తన మనుష్యులను సుందరారుకు తోడిచ్చి పంపాడు. పరమశివుడు కూడ సుందరారు తన నుండి అనేక వస్తువులను పొందవలెనని అభిలషించాడు. తన నుండి కాక ఇతరులనుండి స్వీకరించ దగునా ? అందుకని చేరమానుఇచ్చిన వస్తువులు సుందరారుకు దక్కలేదు. సుందరా రు తన పరివారముతో తిరుమురగన్‌పోండి దాటిపోతుంటే ఆ వస్తువులనన్నిటిని తస్కరు లు దొంగిలించారు. వేటగాళ్ళ లాగ దొంగలు దండెత్తగా సుందరారు పరివారము వస్తు వులనన్నిటిని అక్కడే వదిలి - చెల్లా చెదురైంది. సుందరారుకు దోపిడి జరిగిందని చెప్పా రు. సుందరారు దేవుని సన్నిధికి పోయి పడిగం పాడి బయటకు వచ్చేసరికి పోయిన వస్తువులన్నీ అక్కడ కన్పట్టాయి. అంటే ఇవన్నీ శివుడు తన కిచ్చిన వన్నమాట. దైవలీలలు ఎంత విచిత్రము !

కొంతకాలము గడచింది. సుందరారుకు చేరమాను పెరుమాళ్లను మళ్ళీ చూడ వలెననిపించింది. కుండకోలూరు త్రోవలో తిరుపొక్కిలియూరు అవినాశి చేరుకొన్నాడు. అక్కడ కాలిడుతుండగా మంగళవాయిద్యములు, ఏడుపులు గూడ విన్పించాయి. భోగ ట్టా చేయగా - ఇరువురు బ్రాహ్మణ కుమారులు చెరువునకు స్నానమునకు వెళ్లినట్లు ఒకడు మొసలి బారిపడినట్లు రెండవవాడు దైవ వశమున తప్పించుకున్నట్లు, ఇరువురి ఉపనయనములు ఆ రోజుననే నిశ్చయింపబడినట్లు బ్రదికి బట్ట గట్టినవాని ఉపనయన ము జరుగుతున్నట్లు - రెండవవాని ఇంట ఏడుపులు వినబడుతున్నట్లు తెలిసింది. బ్రదికి యుంటే అతని ఉపనయనము గూడ ఆరోజే జరుగవలె.' సుందరారు మొసలిబారిన పడిన వాని తల్లి దండ్రులను సేద దీర్చాలను కున్నాడు. వారింటికి వెళ్లి వాకిట ముందు నుంచొని యుండగా వారు ఏడుపులు మాని, సుందరారు అంతటివాడు అక్కడకు వచ్చి నందుకు లోపలికి ఆహ్వానింప వాళ్లు బయటకు వచ్చారు. చాల కాలమునుండి సుందరారు దర్శనము అందరూ వాంఛించారు. ఈ ప్రేమాభిమానాలు సుందరారు మనమును ఉద్వేగ

పరచింది. ఈశ్వరుడు ఈతని మనసున ప్రవేశించి చనిపోయిన బాలుని బ్రదికించ తలపు కలిగించాడు. అందుకని చెరువు వద్దకు వెళ్లి అవినాశి దైవముమీద పాట పాడాడు. సుంద రారు ప్రార్థనకు దేవుడు లొంగాడు. మకరము కడుపులో ప్రవేశించి లోన శిథిలమైన బాలుని కి తిరిగి రూపమిచ్చి మొసలి ఆ బాలుని కక్కునట్లు చేశాడు. యముడు గూడ ఆ పిల్లవానికి తిరిగి ప్రాణం పోశాడు. అందరూ ఆశ్చర్యపడునట్లు తేజోవంతముగా మనోహరంగా ఆ బాలుడు అందరికి పునర్జీవముతో కనబడ్డాడు. ఈ అద్భుతమునకు పిల్లవాని తల్లిదండ్రుల సంతోషానికి గట్లు లేకపోయాయి. సుందరారు కాళ్లకు మ్రొక్కారు. సుందరారు ఆ పిల్ల వానిని గుడికి తీసి కొని వెళ్ల అవినాశియప్పార్‌ను కొలిచి ఆ బాలునకు తనే ఉపనయనము గావించాడు.

చేరమానునకు ఈ అద్భుత సంఘటనతో సుందరార్ మీద ప్రేమ గౌరవాలు అతిశయి ల్లగా కొడున్ కోలూరులో సుందరారును ఘనంగా ఆహ్వానించాడు. సుందరారు రాజుగారితో కొంతకాలమున్నాడు. ఒక రోజున ఒంటరిగా గుడికి వెళ్లి దేవుని అర్చించాడు. దైవాన్ని చూడగా నే అతనిలో తన్మయత్వము ఆవహించింది. ఆనంద భాష్పాలు రాలుస్తూ నేలమీద దొర్లాడు. రోమాలు నిక్కబొడుచుకున్నాయి. మనస్సు భగవంతునిపైననే కేంద్రీకృతమయింది. చాలసేపటి వరకు అతనికి స్పృహరాలేదు. భూమిపై బ్రతుకు దుర్భరమనిపించింది. అందుకే దేవదేవుని తిరిగి కైలాసానికి తీసికొని వెళ్లమని పడిగమును పాడాడు. శివుడు సుందరారును తిరిగి కైలాసమునకు రా నిశ్చయించాడు. అందుకని తనప్రమథగణాల్ని సుందరారును తెల్ల ఏనుగు పై కైలాసానికి తీసికొనిరా పంపాడు. సుందరారుకు ఈ విషయము తెలియబరచారు. సుంద రారు గుడి నుండి బయటకు వచ్చాడు. తెల్ల ఏనుగు తనకై ఎదుట నిలబడి యుంది. మనసు లో చేరమాను పెరుమాళ్‌ను గూడ కైలాసానికి తీసుకు వెళ్లాలను కున్నాడు. ఏనుగెక్కి కైలాసా నికి బయలు దేరాడు. ఆ సమయమున పాడిన పడిగములో బొందితో కైలాసానికి వెళ్లినట్లు లేదు. భౌతిక దేహము అచ్చోటనే విడువబడింది. పాంచ భౌతిక శరీరంలో పంచభూతాలు వాటివాటిలో ఐక్యమయ్యాయి.

ఇచ్చట చేరమానుకు సుందరారు కైలాసానికి వెళ్తునట్లుగా స్ఫురించింది. వెంటనే భద్రాశ్వాన్ని అధిరోహించి తిరు అంచైకలముకు వెళ్లాడు. అచ్చట సుందరారు తెల్ల ఏనుగు పై వెళ్తునట్లు చూచాడు. తక్షణమే అశ్వము చెవిలో పంచాక్షరిని ఉచ్చరించాడు. ఆఘమే ఘాలతో గుఱ్ఱము చేరమానును సుందరారు దగ్గరకు చేర్చింది. చేరమాను సుందరారు ను అచ్చట కొలిచాడు. ఇద్దరి ఆత్మలు కలిసి కైలాసానికి చేరాయి.

కైలాసంలో ద్వారపాలకులు ఒక్క సుందరారునే లోనికి ఆహ్వానించారు. సుంద రారు శివుని నుతించాడు 'దయాసాగరా! నాతప్పలను క్షమించావు. సంసార బంధనాల నుండి తప్పించావు. నీ సమక్షమునకు నన్ను లాక్కున్నావు. అనంతమైన ఆనందానిచ్చేవు. నీ వెంత దయార్ద్ర కరుణార్ద్ర హృదయుడవు' అని నుతించి చేరమాను బయట వేచి యున్నాడని చెప్పాడు. తన స్నేహితుని మురిపించుటకు పరమశివుడు తన వాహనమైన నందికేశ్వరుని చేరమానుని తీసికొని రమ్మని పంపాడు. శివుడు చేరమానును "తన అనుమతి లేనిదే ఎట్లా రాగలగావు ?" అని అడిగాడు. "సుందరారు కైలాసానికి బయలు దేరుట చూచాను. అతని వియోగము భరించలేక అతనితో వచ్చాను" అని చేరమాను

బదులిచ్చాడు.

ఈ సంఘటనలో చేరమాను ఒక మహాసత్యాన్ని వెల్లడించాడు. "ఒకడు అనర్హుడైనను ఋషికి గురువునకు ఆత్మీయుడవగలిగినచో గురువు తనతో బాటు తన శిష్యునికి గూడ భగవత్ సాన్నిధ్య మొసగగలడు" అన్న సత్యము రూఢమైనది.

సుందరారు పూర్వపురీతిని మనసా, వాచా, దైవాన్ని కొలుస్తూ కైలాసంలో వుండిపోయాడు. పరవయారు, సంగ్లియార్లు పుడమిపై తమ పూర్వజన్మ కర్మలననుభవించి కైలాసానికి చేరారు. పార్వతీదేవికి యధావిధిగా వారివారి పరిచర్యలు ప్రారంభించారు. పెరుమాళ్ళను నమ్మిన భటులు తమ ప్రభువును విడిచి యుండజాలక కత్తులతో బొడుచుకొని - కైలాసానికి చేరుకున్నట్లు ప్రతీతి.

****